క్లుప్తంగా

సర్పంచు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: మండలంలోని ఏలుకుంట్ల సర్పంచు మంగమ్మ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మంగమ్మ కుమారుడు శుక్రవారం పొలంలో ట్రాక్టర్‌తో వ్యవసాయం చేస్తుండగా తిరగబడి ట్రాక్టర్ కింద పడి దామోదర్ మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకుని వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఏ కష్టం వచ్చినా అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం వారికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

గంటల మారెమ్మ ఆలయంలో పూజలు



గంటల మారెమ్మకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

పుట్టపర్తి అర్బన్: బత్తలపల్లి సమీపంలో వెలసిన గంటల మారెమ్మ ఆలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ పూజారులు సంప్రదాయ బద్ధంగా ఎమ్మెల్యేకు చీర,పసుపు, కుంకుమ అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇంటర్ వర్సిటీ చెస్ పోటీలకు ధర్మవరం విద్యార్థి



విద్యార్థి రాజును అభినందిస్తున్న కోచ్

ధర్మవరం అర్బన్: సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలకు ధర్మవరం డిగ్రీ విద్యార్థి ఎంపికైనట్లు బీఎస్‌కే చెస్ అకాడమీ చీఫ్ కోచ్ ఆదిరత్నకుమార్ ఆదివారం తెలిపారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 26,27 తేదీల్లో జరిగిన పోటీల్లో విద్యార్థి రాజు 5 మ్యాచ్‌లకు గాను 4 మ్యాచ్‌లు గెలిచి 4వ స్థానం నిలిచాడన్నారు. దీంతో నిర్వాహకులు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ తరఫున చెన్నైలో నవంబర్‌లో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈసందర్భంగా విద్యార్థి రాజును ఆయన అభినందించారు.

ఓబుళనాయనపల్లిలో పోలీసు సోదాలు



నాటుసారా ఊటను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ధర్మవరం రూరల్: ఓబుళనాయనపల్లి, తండాలలో ఆదివారం తెల్లవారుజామున ధర్మవరం రూరల్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో గ్రామంలోని ప్రతి ఇంట్లోనూ సోదాలు చేపట్టారు. ఊరి బయట ముళ్లపొదల్లో ఉన్న సారా తయారీకి ఉపయోగించే 50 లీటర్ల ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం గ్రామసభను నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా అమ్మినా, తయారు చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గొడవలకు దూరంగా ఉండాలని, ప్రశాంతంగా జీవించాలని గ్రామస్తులకు సీఐ, ఎస్‌ఐ సూచించారు.

వెంటాడుతున్న వర్షాభావం

- తాడిమర్రి మండలంలో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పీఏబీఆర్ కాల్వ నీరే దిక్కు
- సాగునీటి కోసం ఎదురు చూస్తున్న మండల రైతులు



తాడిమర్రిలోని పీఏబీఆర్ కుడికాల్వ

తాడిమర్రి: మండలంలో ఏళ్ల తరబడి వర్షాభావం వెంటాడుతోంది. దీంతో భూగర్భ జలాలు అడుగంటి బోరు బావుల్లో నీటి మట్టం అమాంతం పడిపోయింది. ఫలితంగా చీనీ, మామిడి, దానిమ్మ, సపోటా, జామ, అరటి తదితర పండ్లతోటల సాగు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి కూడా వర్షాలు సక్రమంగా కురువలేదు. ఇటీవల కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసి నదులు, వంకలు, వాగులు పారి చెరువులు నిండి మరవలు పారినా తాడిమర్రి మండలంలో కనీసం చిన్నపాటి వంక కూడా పారలేదు. ఐదు రోజుల తుపాన్‌లోనూ వరుణ దేవుడు కరుణించలేదు. కేవలం జల్లులకే పరిమితమై మండల వర్షపాతం అతి తక్కువగా నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల్లో అక్టోబర్ 20 నుంచి 24 వరకూ నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురవగా గోరంట్ల అత్యధికంగా 618.9 వర్షపాతంతో మొదటి స్థానంలో నిలిచింది. మరో ఎనిమిది మండలాలు 500 ఎంఎం పైగా వర్షపాతం నమోదు కాగా మరో ఎనిమిది మండలాలు 400 ఎంఎంకు పైగా నమోదు అయితే తలుపుల అత్యల్పంగా 209.7 ఎంఎం, తాడిమర్రి మాత్రం 218.9 అత్యల్ప వర్షపాతం నమోదులో రెండో స్థానంలో నిలిచింది.

పీఏబీఆర్ కుడికాల్వ నీటిపైనే ఆశలు..

వరుణ దేవుడు కనికరించక పోవడంతో మండల రైతులు పీఏబీఆర్ కుడికాల్వ నీటిపైనే ఆశలు పెట్టుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక కృషితో మూడు దపాలుగా మండల చెరువులను పీఏబీఆర్ నీటితో నింపారు. దీంతో పండ్లతోటల సాగు రైతులకు మూడేళ్లపాటు ఊరట లభించింది. అయితే ప్రస్తుతం మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పండ్లతోటల సాగు రైతుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దాదాపు 600 నుంచి 1000 అడుగుల లోతు బోర్లు వేస్తే తప్ప నీరు పడేటట్టు కనిపించడం లేదు. పీఏబీఆర్ నీటిని మండల చెరువులకు విడుదల చేయించి నింపితే తప్ప రైతులు కోలుకునే పరిస్థితి కనిపించలేదు.

చెరువులు నింపాల్సిందే..

మండలంలో ప్రధానంగా నార్శింపల్లి, నిడిగల్లు, తాడిమర్రి తూర్పు, తాడిమర్రి పడమర, ఎం.అగ్రహారం చెరువులతో పాటు ఏకపాదంపల్లి, మేడిమాకులపల్లి, పుల్లానారాయణపల్లి గ్రామాల్లోని కుంటలను నింపితే పుల్లంపల్లి, పిన్నదరి, భీమరాయుని పేట, చిల్లకొండయ్యపల్లి, బంగారంపేట, మోదుగులకుంట, మరవపల్లి, శివంపల్లి తదితర గ్రామాల రైతులకు ప్రయోజనంగా ఉంటుంది. ఆ చెరువులు నిండితే బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగి సుమారు వెయ్యి ఎకరాల్లో పండ్లతోటల సాగు రైతులకు ఊరట లభించనుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రత్యేక కృషితో నీటిని విడుదల చేయిస్తే మండలంలో భూగర్భ జలాలు పెరిగి పండ్లతోటలకు ఊరట లభిస్తుందని మండల రైతులు కోరుతున్నారు.

పీఏబీఆర్ నీటితో రైతులకు ఊరట



మండల చెరువులకు పీఏబీఆర్ కుడికాల్వ ద్వారా నీటిని విడుదల చేయిస్తే మండల రైతులకు కాస్త ఊరట లభిస్తుంది. గత రెండు, మూడేళ్లుగా మండలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నొలకొన్నాయి. దీంతో భూగర్భ జలాలు తగ్గి బోరు బావుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో పండ్లతోటలను కాపాడు కోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.

–కే.విశ్వనాథ్, తాడిమర్రి

నీటి కోసం ఎదురుచూపులు



మండల చెరువులకు నింపడానికి ప్రతి ఏడాది విడుదల చేయాల్సిన పీఏబీఆర్ నీటి కోసం ఎదురు చూస్తున్నారు. మండల చెరువులను నింపడానికి ప్రతి ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో పీఏబీఆర్ నీటిని విడుదల చేస్తారు. వర్షాభావంతో నీటి మట్టం తగ్గిన బోరువుల్లో పీఏబీఆర్ నీటితో తిరిగి బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. దీంతో పండ్లతోటలు ఎండిపోకుండా కాపాడుకో గలుగుతాం.

–ఎం.రామచంద్రారెడ్డి, తాడిమర్రి

ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలి



చెకుముకి రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు ఎంపికైన విద్యార్థులతో జేవీవీ బృందం

కదిరి: ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆదిశేషు పేర్కొన్నారు. స్థానిక సాధన స్కూల్‌లో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనచుట్టూ ఉన్న పరిసరాలు, ప్రకృతి నుంచి మనం ఎంతో నేర్చుకోవచ్చన్నారు. చెకుముకి పరీక్షలతో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.జయచంద్రారెడ్డి తెలిపారు. సైన్స్‌ను స్వార్థ ప్రయోజనాలకు వాడుకొని ప్రజలను మోసగిస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హిందూపురం జోన్ అధ్యక్షులు రామక్రిష్ణ తెలియజేశారు. అనంతరం ఆయన ప్రదర్శించిన ఇంద్రజాలం ఆకట్టుకుంది.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే:

ప్రభుత్వ పాఠశాలల నుంచి సిద్దరాంపురం ఉన్నత పాఠశాలకు చెందిన వి.లోకేష్‌కుమార్‌రెడ్డి, చాంద్ ప్రియ, చిన్న శివయ్య, ప్రైవేటు పాఠశాలల నుంచి ఓడీచెరువు రెయిన్‌బో ఉన్నత పాఠశాలకు చెందిన బి.లయశ్రీ, యశ్వంత్, హర్షవర్ధన్ రెడ్డి రాష్ట్రస్థాయి చెకుముకి పరీక్షలకు ఎంపికై నట్లు జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలే నరసారెడ్డి ప్రకటించారు. ఈ పరీక్షల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి పాఠశాల కరస్పాండెంట్ సాదిక్ మెమెంటోలను అందజేశారు. వైఎస్సార్ టీచర్స్ అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రప్రసాద్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అమ్మదొంగా..!



విద్యార్థి హరీష్

బత్తలపల్లి: ఇంటి వద్దనున్న తల్లిపై బెంగతో ఓ విద్యార్థి బడిలో వారికి ఎవ్వరికి చెప్పకుండా ఇంటికి చేరుకున్నాడు. అయితే పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థి కనిపించకుండా పోయిన విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు విచారించి తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నట్లు తేల్చారు. ఈ సంఘటన మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బీసీ బాలుర పాఠశాలలో చోటు చేసుకుంది. వివరాలు..బత్తలపల్లిలోని గురుకుల పాఠశాలలో కనగానపల్లి మండలం నెమలివరం గ్రామానికి చెందిన బి.హరీష్ 8వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి తన తల్లిని చూడాలనిపించింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం భోజన సమయంలో అన్నం తిన్న తరువాత బయట ఆడుకునేందుకు వదిలారు. ఈ సమయంలో ఎవ్వరికీ చెప్పకుండా గ్రామానికి బయలుదేరి వెళ్లిపోయాడు. తిరిగి వారిని లోపలికి పిలిచిన తర్వాత విద్యార్థి కనిపించకపోవడంతో గ్రామానికి సమాచారం ఇచ్చారు. అక్కడికి రాలేదని తెలిపారు. దీంతో హైరానా పడ్డ ఉపాధ్యాయులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణ జరుపుతుండగా విద్యార్థి ఇంటికి చేరినట్లు సమాచారం అందడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



కొలువుదీరిన హనుమత్సమేత సీతారామలక్ష్మణులు

ఎన్పీకుంట: కొండలవాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో ఆదివారం హనుమత్సమేత సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొండలవారి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుఝామున బ్రహ్మ ముహూర్తంలో విగ్రహ మూర్తులను ప్రత్యేక అంకరణ చేసి శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. ఆలయ గోపురం, కలశానికి కుంభాభిషేకం నిర్వహించారు. గోపూజ, విశ్వరూపదర్శనం, అగ్నిప్రతిష్ట, ఆలయ ప్రదక్షిణ, హోమాది కార్యక్రమాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్తులు, భక్తాదుల నడుమ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

కనగానపల్లి: తగరకుంటలో ఆదివారం 20 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు ఎస్‌ఐ ఇషాక్ బాషా తెలిపారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కర్ణాటక మద్యం ప్యాకెట్లను అక్రమంగా విక్రయిస్తున్న డి.పెదకుళ్లాయప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

స్వర్ణోత్సవ సభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నవంబర్ 10న జరిగే యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, నాయకులు శ్రీనివాసులు, తాహిర్‌వలీ,సుబ్బారెడ్డి కోరారు. స్థానిక ఎన్జీఓ హోంలో ఆదివారం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకోసం యూటీఎఫ్ నిరంతరం శ్రమిస్తోందన్నారు. పని సర్దుబాటు సక్రమంగా లేదని, ఉపాధ్యాయులకు రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా కేవలం 350 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించిదని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆజంబాషా, మల్లికార్జున, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి దాతలు రూ.45 వేలు విరాళం అందించారు. ఆదివారం ఆలయంలో దాతలైన కొమ్మిశెట్టి కృష్ణమూర్తి, అరుణాదేవి, కూతురు బిందుప్రియ, భవ్యశ్రీ, తోషిత నగదు అందించగా ఆలయ కమిటీ సభ్యుడు బంధనాథం సూర్యప్రకాష్ వారిని శాలువాతో సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ధర్మవరం రూరల్: చిగిచెర్ల విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జానకిరామయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు ఉపకేంద్రంలో నిర్వహణ పనులు నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు గమనించాలని కోరారు.

మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా వీరనారాయణ



నియామక పత్రంతో వీరనారాయణ

నల్లమాడ: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా యర్రవంకపల్లికి చెందిన న్యాయవాది కే.వీరనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ కన్వీనర్, జిల్లా సంక్షేమ అధికారి శివరంగప్రసాద్ నుంచి నియామక పత్రం అందుకున్నట్లు ఆయన ఆదివారం తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు వీరనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ముళ్లపొదలతో శ్మశానవాటిక



శ్మశానంలో పెరిగిన కంపచెట్లు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఐటీఐ వెనుక భాగంలో, వెంకటాంపల్లికి వెళ్లే దారిలో ఉన్న శ్మశానవాటికలు ముళ్లపొదలతో నిండిపోయాయి. శ్మశానంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా ముళ్లకంపలు పెరిగిపోయాయి. దీంతో అంత్యక్రియలు చేసేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి చెందిన వారు ముందుగానే శ్మశానవాటికకు వెళ్లి ముళ్ల చెట్లను తొలగించి శవాన్ని ఖననం చేయాల్సి పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకంలో భాగంగా ముళ్లచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానం చేయండి

ఓడీచెరువు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పుట్టపర్తిలో సోమవారం జరిగే రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని ఎస్‌ఐ మల్లికార్జున కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రక్తదానం చేసే వారు ఉదయం 7 గంటలకు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు వస్తే పుట్టపర్తికి వాహనంలో తీసుకెళతామన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి



రూట్ మార్చ్ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

ధర్మవరం అర్బన్: అందరి సహకారంతో హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తామని ఆర్ఎస్ఎస్ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ కొండపల్లి రామారావు, రిటైర్డ్ ఆర్మీ లెఫ్టినెంట్ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వదేళ్లయిన సందర్భంగా పురవీధుల్లో పద సంచలన్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, పీఆర్‌టి సర్కిల్, గాంధీసర్కిల్ , తేరుబజార్, అంజుమన్ సర్కిల్ మీదుగా కళాజ్యోతి వరకు రూట్ మార్చ్ సాగింది. ఈ సందర్భంగా కళాజ్యోతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సమాజంలో మంచి పరివర్తన తీసుకుని రావాలన్నారు.

కేసు నమోదు

కదిరి అర్బన్: దాడి ఘటనలో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. వివరాలు..కుమ్మరవాండ్లపల్లికి చెందిన హరీష్, ఆరీఫ్, నజీర్ అన్నదమ్ములు. వీరు కుమ్మరవాండ్లపల్లిలో టీ హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఆరీఫ్ స్నేహితుడు, కదిరి వాసి హన్ను తనను ఈ మధ్య కలవడం లేదంటూ గొడవపడ్డాడు. ఇది మనసులో పెట్టుకున్న హన్ను తన బంధువులైన మౌలా, షబ్బీర్, షానవాజ్, రియాజ్ ద్వారా కుమ్మరవాండ్లపల్లిలో హోటల్ ఉన్న హరీష్, ఆరిఫ్, నజీర్ తోపాటు వారి తండ్రి ఖాదర్‌బాషాపై దాడి చేయించాడు. ఆరీఫ్ ఫిర్యాదు మేరకు నలుగురిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ మోహన్ తెలిపారు.

నీరు.. నిబంధనలు పట్టించుకోరు!

- శుద్ధ జలం పేరుతో నాణ్యతలేని నీరు విక్రయం
- ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులు
- పట్టించుకోని అధికారులు



నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్



ఆటోలో విక్రయిస్తున్న జనరల్ వాటర్

ధర్మవరం: నియోజకవర్గంలో శుద్ధజలం పేరుతో జనరల్ వాటర్‌ను సరఫరా చేస్తూ ధనార్జనే ధ్యేయంగా ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు. ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నీటిని విక్రయిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో నాణ్యత లేని నీటితో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు. నీటి దోపిడీని అరికట్టాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధర్మవరం నియోజకవర్గంలో 69 వరకు వాటర్ ప్లాంట్లున్నాయి. వీటిలో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లు, ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంట్ల నిర్వాహకులు కూడా మినరల్ వాటర్ పేరుతో గ్రామాలు, వార్డుల్లో ఆటోల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ధర్మవరం మండలంలో 38, తాడిమర్రిలో–6, ముదిగుబ్బలో–15, బత్తలపల్లిలో 10 దాకా వాటర్ ప్లాంట్లున్నాయి.

ఐఎస్ఐ గుర్తింపు లేదు..

ఈ ప్లాంట్లలో ఏ ఒక్కదానికి ఐఎస్ఐ గుర్తింపు లేదు. ప్రతి ప్లాంట్‌లో నీటిని నిల్వ చేసే ట్యాంక్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఉండాలన్న ప్రధాన నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో ప్రజలు ఆయా ప్లాంట్లలో అరకొర శుద్ధి చేసిన నీళ్లను కొనుగోలు చేసి అనారోగ్యానికి గురవుతున్నారు. ఆటోల్లో మినరల్ వాటర్ పేరుతో ఒక్కో క్యాన్‌ను రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో దాదాపుగా 150కు పైగా ఆటోల్లో నీటిని విక్రయిస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ప్రజలు మాత్రం వేరే ప్రత్యామ్నాయం లేక పోవడంతో ఆనీటిని కొనుగోలు చేసే దుస్థితి నెలకొంది. ఫలితంగా ఇటీవల ధర్మవరం నియోజకవర్గంలో టైఫాయిడ్, డయేరియా వ్యాప్తి అధికమవుతోంది. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 33 వాటర్‌ప్లాంట్లలో ఏ ఒక్కటీ నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతో గతంలో మున్సిపల్ అధికారులు సైతం ఆయా ప్లాంట్లకు నోటీసులు జారీ చేశారు. కానీ చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు పాటించాల్సిన నాణ్యతా ప్రమాలు ఎలా ఉండాలో పరిశీలిస్తే...

వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు

- మున్సిపాలిటీ, లేదా గ్రామ పంచాయతీల అనుమతి తీసుకున్నాకే వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలి
- వాటర్ క్యాన్ మీద నీటిని శుద్ధి చేసిన తేదీ బ్యాచ్ నంబర్‌ను నమోదు చేయాలి. ప్రతి నెలా శానిటరీ అధికారులు పరీక్షించి ఆ నీటిని బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్)కు పంపాలి
- వాటర్ ప్లాంట్ ప్రారంభించాలంటే ఐఎస్ఐ నిబంధనలు తప్పక పాటించాలి
- ప్లాంట్‌లో మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులు ఏర్పాటు చేయాలి. శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసేందుకు 304 గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులు మాత్రమే ఉపయోగించాలి
- శుద్ధి చేసిన నీటిని తరచూ మైక్రో బయాలజిస్ట్ పరీక్షిస్తూ ఆ నీటిలో పీహెచ్ శాతం ఎంత ఉందో పరీక్షించాలి. పీహెచ్ శాతం 75 శాతం తగ్గితే ఆ నీటిని తాగిన వారు కిడ్నీ సంబంధిత వ్యాధుల బారిన పడే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు.

విధిలేక కొంటున్నాం



శుద్ధ జలం పేరుతో ఆటోలు, వాటర్ ప్లాంట్లలో ఒక్కో క్యాన్‌కు రూ.10 నుంచి రూ.20ల వరకు విక్రయిస్తున్నారు. ఆ నీరు ఏ మాత్రం బాగుండటం లేదు. గత్యంతరం లేక ఆ నీటిని తాగుతున్నాము. ఇటీవల తరచూ జ్వరాల బారిన పడటం అనారోగ్యానికి గురవ్వడం పరిపాటిగా మారింది. అధికారులు స్పందించి నాణ్యమైన నీటిని అందించేలా చర్యలు చేపట్టాలి.

–గుండా ఈశ్వరయ్య, చేనేత కార్మికుడు, ధర్మవరం

నీటి దోపిడీ అరికట్టాలి



పట్టణంలోనాణ్యతలేని ప్యూరిఫైడ్ వాటర్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం నీటిని శుద్ధి చేయకుండా ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ప్లాంట్ల ఏర్పాటులో కూడా నిబంధనలు పాటించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

–పురుషోత్తం, వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షుడు ధర్మవరం

విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేష్

నల్లమాడ: ఎన్నికల వాగ్దానానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం పెంచిన 44 శాతం విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇ.వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక సాయి సప్తగిరి కల్యాణ మండపంలో ఆదివారం సీపీఎం మండల శాఖ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ దేశ ప్రజలకు ద్రోహం చేస్తోందన్నారు. రాజ్యాంగంపై దాడి చేస్తున్న బీజేపీ మతోన్మాద శక్తులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న కూటమి నాయకులు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు భారీగా పెంచడం దుర్మార్గమన్నారు. ప్రపంచ బ్యాంకు సిఫార్సులకు అనుగుణంగా విద్యుత్ ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మినారాయణ, శాఖా సభ్యులు ఆదినారాయణ, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.